
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 7 | ఏప్రిల్ | 2025



నేటి నుంచి 'పది' మూల్యాంకనం

పదోతరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. - 8లో



పాలనపై ప్రతికూల ప్రభావం!

కేయూలో అధ్యాపకుల కొరతతో యూనివర్సిటీ పాలనపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అయినా అధికారులకు పట్టింపులేదని యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
37.5° /26.2°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

షెడ్యూల్‌లో చేరిస్తేనే రిజర్వేషన్లు సాధ్యం

మొగుళ్లపల్లి: తమిళనాడు తరహాలో తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు జీఓల ద్వారా నిలువవన్నారు. 1962 నుంచి ఇప్పటివరకు రిజర్వేషన్ల పెంపుపై ఎన్ని జీఓలు, చట్టాలు వచ్చినా అమలు కాలేదన్నారు.

బదిలీలు నిలిపేయాలని మంత్రికి వినతి

కాటారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కొనసాగుతున్న నేపథ్యంలో కాటారం సబ్ డివిజన్‌లో బదిలీల ప్రక్రియ నిలిపేయాలని కోరుతూ ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాటారం సబ్‌డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో మంథని నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు సొంత డబ్బు పంచాయతీ కార్యదర్శులు ఖర్చు చేశారన్నారు. రెండేళ్లుగా నిధుల కొరత కారణంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కొరత ఉందని వారు మంత్రికి విన్నవించారు. బదిలీల కారణంగా కార్యదర్శులకు అందాల్సిన బకాయిలపై పలు అంశాలు ప్రభావితం చేస్తాయని తమ సమస్యలను అర్థం చేసుకొని బదిలీలు నిలిపివేయాలని మంత్రిని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సబ్ డివిజన్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



భూపాలపల్లి రూరల్: పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ విజన్‌తో రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి రానున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు బట్టు రవి, పార్లమెంట్ కో- కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, నాయకులు దొంగల రాజేందర్, దాసరి తిరుపతిరెడ్డి, పెండ్యాల రాజు, వేణు, రఘునాథరెడ్డి, మునీందర్, కుమార్, విప్లవ రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి అదే గ్రామానికి చెందిన కాల్వ రఘోత్తంరెడ్డి కుమారుడు కాల్వ రాంరెడ్డి రూ.లక్ష వెయ్యి నూట పదహారు ఆలయ కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మందల రాఘవారెడ్డి, మోతుకూరి నరేష్, చెక్క నర్సయ్య, బిళ్ల సత్యనారాయణరెడ్డి, బొమ్మ శంకర్, కొక్కుల సారంగం, కాల్వ సమ్మిరెడ్డి, సర్వ శరత్, తీగల నాగరాజు, ప్రధాన అర్చకులు రఘునందన్ పాల్గొన్నారు.

లీకేజీలను గుర్తించిన ఇంజనీర్లు



ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లోని రిజర్వాయర్ సమీపాన ఇటీవల జరిగిన టన్నెల్ లీకేజీలను ఎట్టకేలకు ఇంజనీర్లు గుర్తించారు. దేవాదుల పథకంలో భాగంగా 3వ ప్యాకేజీ కింద దేవన్నపేట పంపుహౌస్ నుంచి రిజర్వాయర్ సమీపం వరకు పైపులైన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి సుమారు 200 మీటర్లు రిజర్వాయర్ వరకు టన్నెల్ నిర్మించారు. ఈ క్రమంలో గత నెల 27న రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేయగా వారం రోజుల క్రితం టన్నెల్ లీకేజీ అయింది. దీనితో పంపులు ఆపివేసి టన్నెల్ నుంచి నీటిని డీ వాటరింగ్ చేశారు. ఈ క్రమంలో ఆదివారం పైపు నుంచి టన్నెల్‌లోకి దిగిన మెగా ఇంజనీర్లు, సిబ్బంది లీకేజీలను కనుక్కుని మరమ్మతులు ఎలా చేయాలో పరిశీలించారు.

కోదండరామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కాళేశ్వరం: కల్యాణానికి హాజరైన భక్తులు



మంగళసూత్రం చూపిస్తున్న పండితుడు



కల్యాణం కమనీయం

కనులపండువగా శ్రీరామనవమి వేడుకలు

- వేలసంఖ్యలో హాజరైన భక్తజనం

భూపాలపల్లి అర్బన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు బారులుదీరారు. జిల్లావ్యాప్తంగా కోదండ రామాలయాలు, హనుమాన్ దేవాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సీతారామచంద్రస్వామి రామాలయంలో భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీరామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామివార్ల కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని వీక్షించిన భక్తులు పులకరించిపోయారు. జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వరరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

అటకెక్కిన డేంజర్ జోన్

జెన్‌కో తీరుతో భూ నిర్వాసితులకు ఇబ్బందులు

- బ్లాస్టింగ్‌లతో భయాందోళన
- సీఎండీ రాకతో చిగురించిన ఆశలు

మల్హర్: తమ ప్రాంతంలో అపార బొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు అవసరం అయిన ఇళ్ల స్థలాలను సైతం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నిర్వాసితులను జెన్‌కో మాత్రం తన తీరుతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. తాడిచర్లలో బొగ్గు తవ్వకాల కోసం అన్వేషణ ప్రారంభించినప్పటి నుంచి తమకు దక్కాల్సిన వాటికోసం ఈ ప్రాంతవాసులు ఎన్నోమార్లు రాజీలేని పోరాటాలు చేపట్టారు. ప్రతీ సందర్భంలోనూ కంపెనీ తనకు అనుకూలంగా ఉండే విధంగా వ్యవహరిస్తూనే నిర్వాసితుల సమస్యలను మాత్రం పెడచెవిన పెడుతూనే ఉంది. బొగ్గు వెలికితీత ప్రారంభించి ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ ఈ ప్రాంతవాసులకు డేంజర్ జోన్ ఇళ్ల సమస్య పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు.

బ్లాస్టింగ్‌లతో భయాందోళన

బొగ్గు వెలికితీత కోసం పెడుతున్న బాంబులు ఇళ్లలో వణుకు పుట్టిస్తున్నాయి. ఈ బాంబులతో గిన్నెలు, బోళ్లు కూడా కింద పడుతున్నాయి. అసలు ఇంట్లో ఉండాలంటేనే భయం.. భయంగా బతికే పరిస్థితి నెలకొంది. ఇది మండల పరిధిలోని పెద్ద తాడిచర్ల ఉపరితల బొగ్గు గనికి కూతవేటు దూరంలో నివసించే కాలనీ వాసుల ఆవేదన. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో రోజురోజుకూ ప్రజల్లో భయాందోళన పెరుగుతుంది. ఓసీపీ ప్రాజెక్టు 500 మీటర్ల పరిధిలో ఇళ్లు ఉండడంతో పాటు స్థాయికి మించి బ్లాస్టింగ్ చేయడం ద్వారా తమ ఇళ్ల కప్పులు పగులుతున్నాయని, గోడలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయంలో ఉండాలంటేనే జంకుతున్నామని చెప్పారు. పనులతో వచ్చే దుమ్ము, ధూళి ఇళ్లపై చేరడంతో పాటు, తినే ఆహార పదార్థాలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని అంటున్నారు.



పెద్ద తాడిచర్ల విలేజ్

పీఎన్ ప్రకటనకే పరిమితం

డేంజర్ జోన్ పరిధిలో ఉన్న ఇళ్ల సేకరణకు 2022 డిసెంబర్ 14న 359.23 ఎకరాలకు 2600 చిలుకు ఇళ్లకు పీఎన్ (ప్రాథమిక నోటిఫికేషన్)ను ప్రతికల్లో ప్రచురించారు. కానీ డిక్లరేషన్ ప్రకటించకపోవడంతో 2024 డిసెంబర్‌లో సదరు నోటిఫికేషన్ రద్దయింది. దీంతో డేంజర్ జోన్ సమస్య మొదటికి వచ్చింది. నోటిఫికేషన్ వేసి ఇళ్లు సేకరించి తమకు న్యాయం చేయాలని మండలానికి వచ్చిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

సీఎండీ రాకతో..

మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌లో జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానీయ ఈనెల 1వ తేదీన పర్యటించారు. ఈ నేపథ్యంలో మండలంలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ ఇళ్ల సమస్యను పరిష్కస్తామని నిర్వాసితులు ఆందోళన చెందవద్దని హామీఇచ్చారు. సీఎండీ ప్రకటనతో నిర్వాసితుల్లో డేంజర్ జోన్‌పై ఆశలు చిగురించాయి. డేంజర్ జోన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొంతమంది ఇప్పటికే హైకోర్టు మెట్లు ఎక్కినట్లు తెలిసింది.



బ్లాస్టింగ్‌లతో బీటలు వారిన ఇళ్లు

సేకరణ పనులు ప్రారంభించాలి



మండలంలో పెద్ద తాడిచర్ల ఇళ్ల సేకరణ పనులు ఆలస్యం చేయకుండా ప్రారంభించాలి. ఓపెన్ కాస్ట్ బ్లాసింగ్‌లతో తాము ఇబ్బందులు పడుతున్నాం. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలి.

- మంతెన సమ్మయ్య, పెద్ద తాడిచర్ల, మల్హర్

కల్యాణాన్ని వీక్షించిన మంత్రి

కాటారం: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల విందుగా సాగింది. కల్యాణాన్ని మంత్రి శ్రీధర్‌బాబు వీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తల్లి జయమ్మ, సోదరుడు శ్రీనుబాబు దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అంతకముందు శ్రీనుబాబు దంపతులు శ్రీసీతారాముల సహిత లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను. పట్టు వస్త్రాలను మంత్రి ఇంటి నుంచి ఆలయం వరకు తీసుకొచ్చారు. కాటారం మండల కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంతో పాటు, గారెపల్లి ఆంజనేయస్వామి ఆలయం, ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో కల్యాణం ఘనంగా నిర్వహించారు.



కాటారం: ధన్వాడలో స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాజ్యాంగంపై అవగాహన పెంచడమే లక్ష్యం



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల: నాపాక ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్/ రేగొండ: రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రం, కొత్తపల్లిగోరి మండలాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పలువురు మేధావుల ఆలోచనలతో ఏర్పడిన పవిత్ర గ్రంథామన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని బీజేపీ అణగదొక్కాలని చూస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు సూదనబోయిన ఓంప్రకాశ్, దుగ్యాల రాజేశ్వరరావు, చిగురుమామిడి కుమార్, వెంకటేష, వీరబ్రహ్మం, శ్రీనివాస్, ప్రభాకర్, సంతోష్ రాజయ్య, పాల్గొన్నారు.

నాపాక ఆలయం సందర్శన

చిట్యాల: నైన్‌పాక నాపాక శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. అనంతరం ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలలో పాల్గొని పూజలు చేశారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని కళాకారులకు బహుమతులు అందజేశారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి



ప్రజాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

న్యూడెమోక్రసీ నాయకులు సాంబయ్య

ములుగు రూరల్: దండకారణ్యంలో మావోయిస్టులపై సాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు బొమ్మెడ సాంబయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ప్రజాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన హక్కుల రక్షణకు రాజ్యాంగంలో పొందుపరిచిన షెడ్యూల్‌లోని చట్టాలను ప్రధాని మోదీ, అమిత్‌షా కాలరాస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపదను దోచిపెట్టేందుకే అమాయకపు గిరిజనులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుతున్న హత్యాకాండను నిలిపివేయాలని కోరారు. రేపు(8వ తేదీ)హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు చౌక్ వద్ద చేపడుతున్న ప్రజాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్ పాల్గొన్నారు.

రణదివే ఆశయాలను కొనసాగించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ములుగు రూరల్ : కార్మిక ఉద్యమనాయకుడు, సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివే ఆశయాలను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో రణదివే 35వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం 1970లో ఐక్యత, పోరాటం అనే నినాదంతో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) ఏర్పడిందని అన్నారు. కులం, మతం, లింగ బేధం తేడాలతో విడిపోవడం వల్ల కార్మికులు నష్టపోతారని ఐక్యతగా ఉద్యమం నిర్మించాలని పిలుపునిచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నీలాదేవి, సద్దాం హుస్సేన్, నారాయణ, ప్రవీణ్, రవీందర్, రాజు, రజిత, రమ, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



రణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజేందర్

'ఎల్‌సీ'కి సాంకేతికత జోడింపు

ఆన్‌లైన్‌లో సులభంగా విద్యుత్ లైన్ క్లియరెన్స్

- నూతన యాప్ రూపొందించిన టీజీ ఎన్పీడీసీఎల్
- అధికారులు, ఉద్యోగులకు శిక్షణ



హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తోంది. ఈక్రమంలో లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) తీసుకునేందుకు మరింత బాధ్యతాయుతంగా, సులభంగా ఉండేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇప్పటి వరకు ఫోన్ కాల్ ద్వారా ఎల్‌సీ తీసుకోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యుత్ ప్రమాదాలతో ప్రాణ నష్టం జరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎల్‌సీ(ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ) కోసం ప్రత్యేక యాప్‌ను ఎన్పీడీసీఎల్ యాజమాన్యం రూపొందించింది. ఇప్పటి వరకు ఎల్‌సీ తీసుకుంటే తీసుకున్న ఉద్యోగికి, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు మాత్రమే తెలిసేది. ఈయాప్ ద్వారా ఏఈ, ఏడీఈ, డీఈలు కూడా తెలుసుకునే వీలు కలగడంతోపాటు పర్యవేక్షణ పెరుగుతుంది. ఫీడర్ల ఎంపికలోనూ కచ్చితత్వం ఉంటుంది.

పొరపాట్లకు తావులేకుండా..

ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకోవాలనుకున్న లైన్‌మెన్ యాప్ ఓపెన్ చేసి అందులో సంబంధిత ఫీడర్‌లో ఎల్సీ కావాలని సంబంధిత ఏఈకి విన్నవించుంటే అతను పరిశీలించి ఆ ఫీడర్‌లో ఎల్సీ ఇవ్వొచ్చా లేదా? అత్యవసరాలు ఏమైనా ఉన్నాయా.. అప్పటికే షెడ్యూల్ చేయబడిన పనులు ఉన్నాయా.. మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా? అని పరిశీలిస్తారు. ఏఈ నిర్ణయం మేరకు ఎల్సీ అనుమతి ఆధారపడి ఉంటుంది. ఎల్‌సీకి అనుమతిస్తే లైన్‌మెన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా సమాచారం అందుతుంది. దీని ఆధారంగా సబ్ స్టేషన్ యాప్‌లో నిర్దిష్టంగా పేర్కొన్న ఫీడర్‌లో ఎల్‌సీ ఇస్తారు. దీని ద్వారా పొరపాటు జరుగకుండా ఉంటుంది.

సూచనలిస్తూ..

పొరపాట్లను నివారించేందుకు తగు సూచనల్ని యాప్ ఇస్తుంది. హెల్మెట్ ధరించాలని, హ్యాండ్ గ్లౌజ్‌లు వేసుకోవాలని, ఎర్త్ రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా? లేదా అనే జాగ్రత్తలను యాప్ గుర్తు చేస్తుంది. ఎక్కడైనా డబుల్ ఫీడింగ్ ఉందా? ఈ ఫీడర్‌కు వేరే ఫీడర్‌తో అనుసంధానం ఉందా? వంటి సమాచారాన్ని తెలియజేస్తుంది. దీని ద్వారా జాగ్రత్త పడుతూ ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు. డబుల్ ఫీడరింగ్ ఉంటే రెండు ఫీడర్లలో ఎల్‌సీ తీసుకోవడమా? లేదా ఇతరత్రా జాగ్రత్తలు తీసుకువచ్చా? అని బేరీజు వేసుకుని పనులు చక్కదిద్దుతారు. ఎల్సీ తీసుకున్న ఫీడర్‌లో పనులు పూర్తి కాగానే యాప్‌లో ఆ సమాచారాన్ని లైన్‌మెన్ పొందుపర్చి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించవచ్చనే సంకేతాన్ని, సమాచారాన్ని యాప్ ద్వారా చేరవేస్తారు. దీన్ని సంబంధిత సెక్షన్ ఏఈ పరిశీలించి సబ్ స్టేషన్ ఆపరేటర్‌కు సమాచారం చేరవేస్తారు. దీంతో ఎల్సీ తీసుకున్న ఫీడర్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

భద్రతా ప్రమాణాలు పెంచడానికి యాప్..



విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా భద్రతా ప్రమాణాలను పెంచడానికి ప్రత్యేకంగా ఎల్సీ యాప్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం రూపొందించింది. ఎల్‌సీ యాప్ ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాలు, మానవ తప్పిదాలను అరికట్టవచ్చు. విద్యుత్ ప్రమాదాలు, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు.

- పి.మధుసూదన్‌రావు, ఎస్ఈ, హనుమకొండ

క్లుప్తంగా

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఈ నెల 8న తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 7వ యూత్ అండర్–19 మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి పి.రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 01, 2007 నుంచి డిసెంబర్ 31, 2008 మధ్య లో జన్మించిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ బోనఫైడ్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, రూ.300 ప్రవేశ రుసుం తీసుకుని రావాలని చెప్పారు. క్రీడాకారులు 8న ఉదయం 7గంటలకు హనుమకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్ వద్ద హాజరైతే వెయింగ్ తీసుకుంటామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 11, 12వ తేదీల్లో సికింద్రాబాద్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9959711609 నంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ పేర్కొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు, అతిథులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 చదరంగ పోటీలు సాయంత్రం ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల హాజరైన 40మంది క్రీడాకారుల మధ్య పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ముగింపు వేడుకలకు టీజీటీ మండవ మేనేజర్ రఘువీర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో రిత్విక్ గంధ ప్రథమ స్థానం, సాయిజోషిత్ బొల్లం ద్వితీయ స్థానం, అక్షయ్‌కుమార్ తృతీయ స్థానం, చికిలం చరణ్‌రాజ్ నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో శ్రేష జన్ని, దీపిక బొమ్మిడేని, వర్షిత పటూరి, శ్రీరంకోండ సహస్ర, కోమలి వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచినట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. విజేతలు సెప్టెంబర్ 20, 21 తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యం

ఖిలా వరంగల్: వరంగల్ – కాజీపేట మధ్య శాయంపేట రైల్వే గేట్ సమీపాన రైలు నుంచి జారి పడి గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం లభ్యమైనట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ హంటర్ రోడ్డులోని శాయంపేట గేట్ సమీపాన గుర్తు తెలియని 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడు బ్లాక్ కలర్ ప్యాంట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్ షర్ట్, పారాగాన్ చెప్పల్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఆదివారం ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 9441557232, 8712658585 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందజేయాలని రాజు కోరారు.



పాలనపై ప్రతికూల ప్రభావం!

కేయూలో పలు కీలక పోస్టులు ఖాళీ
- ఇప్పటికే మూడు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ
- ఈనెలాఖరులో మరో డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టు కూడా..
- ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టు కూడా వెకేన్సీనే..
- అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులేవి?

కేయూ క్యాంపస్: వరంగల్ కాకతీయ యూనివర్సిటీ.. తెలంగాణలో రెండో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా పేరొందింది. అంతేకాకుండా న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగి ఉంది. ఇంత ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఫలితంగా యూనివర్సిటీ పాలనపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని యూనివర్సిటీలో చర్చగా ఉంది. రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు 74శాతం ఖాళీగా ఉండగా.. మరోవైపు నాన్‌టీచింగ్‌లో కూడా పలు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే మూడు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు వెకేన్సీలుగా ఉన్నాయి. దీంతో యూనివర్సిటీలో ఇబ్బందులు తప్పడం లేదు. కీలక ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టు కూడా వెకేన్సీగానే ఉంది. యూనివర్సిటీలో ప్రస్తుతం ఒకే డిప్యూటీ రిజిస్ట్రార్ ఉండగా ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా కొనసాగుతూ రెండు బాధ్యతలు డిప్యూటీ రిజిస్ట్రార్ తోట రాజయ్య నిర్వర్తిస్తున్నారు. ఆ డిప్యూటీ రిజిస్ట్రార్ కూడా ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ పొందబోతున్నారు. దీంతో ఇక డిప్యూటీ రిజిస్ట్రార్ నాలుగు పోస్టులతోపాటు ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టు కూడా వెకేన్సీగా ఉండబోతున్నాయి.

సీనియారిటీ సమస్య తేల్చాలి!

కేయూలో 2017–2018లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ నియామకం జరిగింది. అప్పట్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాధాన్యం ఇవ్వలేదనే ఆరోపణలతో ఏఆర్ సీనియారిటీ జాబితాపై గందరగోళం ఏర్పడింది. వీరి సీనియారిటీ నిర్ణయించేందుకు కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి వీసీ సాయన్న రెండు సార్లు కమిటీలు నియమించారు. కానీ ఇప్పటి వరకు ఏఆర్‌ల సీనియారిటీని తేల్చలేకపోయారు. ఇదిలా ఉండగా తాము సీనియర్ అంటే తాము సీనియర్ అని డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్న

> **సూపరింటెండెంట్లకు ఏఆర్‌లుగా పదోన్నతులేవి?**
> 2021లో అప్పటి యూనివర్సిటీ అధికారులు వెకేన్సీ ఏఆర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. 2022లో ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పాలకమండలి ఆమోదంతరంతో నియామకం నిలిచింది. డిప్యూటీ రిజిస్ట్రార్లుగా ఏఆర్‌లకు పదోన్నతులు కల్పిస్తే వారి స్థానంలో సూపరింటెండెంట్లకు కూడా ఏఆర్‌లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. ఆ దిశగా యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సిఉంటుంది.

ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పనేది?



కాకతీయ యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్లలో అర్హులకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించాల్సింది. అయితే అర్హులైన వారికి పదోన్నతి కల్పించడం లేదు.దీంతో డిప్యూటీ రిజిస్ట్రార్ల పోస్టులు వెకేన్సీలుగానే మిగిలిపోయాయి. కేయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులు 16 మంజూరు ఉన్నాయి. రెండు వెకేన్సీలుగా ఉండగా అందులో 14మంది పనిచేస్తున్నారు. ఇందులో ఒకరు ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌లో ఉన్నారు. మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ తన ఇల్లు యూనివర్సిటీ భూమిలో ఉండడంతో ఆయన కూడా సస్పెన్షన్‌లో ఉన్నారు. ఇంకో మహిళా ఏఆర్ స్వచ్ఛంద విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇక 11మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పనిచేస్తున్నారు.

తులు కల్పించాలనే విషయంలో పలువురు ఏఆర్‌లు కొంతకాలం క్రితం హైకోర్టును ఆశ్రయించడంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. దీంతో ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులు కల్పన అంశం జాప్యం అవుతూ వస్తోంది. ప్రస్తుత వీసీ కె. ప్రతాప్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది.

ఒక్కొక్క ఏఆర్ రెండు మూడు పోస్టు విధులు

కేయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ల కొరత కూడా ఉంది. దీంతో అధికారులు పలువురు ఏఆర్‌లకు రెండు మూడు విభాగాల్లోనూ విధులు అప్పగించారు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ లేక ఆరునెలలు కావొస్తోంది. అక్కడ ఏఆర్ అశోక్‌బాబు సస్పెన్షన్ అయ్యాక మళ్లీ ఎవరినీ నియమించలేదు. అలాగే కేయూ హాస్టల్ డైరెక్టరేట్ కార్యాలయంలో కూడాఏఆర్‌గా పనిచేస్తూ కిష్టయ్య ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్ అయి 15 నెలలు గడిచాయి. అప్పటి నుంచి అక్కడ ఎవరినీ ఏఆర్‌గా నియమించలేదు. అలాగే, కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీ, ఖమ్మం పీజీసెంటర్లలో ఏఆర్, సూపరింటెండెంట్లు కూడా లేరు.

విద్యావేత్త కాసం అంజయ్య మృతి



నివాళులర్పిస్తున్న శిష్యులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు. ఇన్‌సెట్‌లో అంజయ్య(ఫైల్)

- కేయూ మాజీ వీసీ, ప్రముఖుల నివాళి

జనగామ: ప్రముఖ విద్యావేత్త, పూర్వ లయన్ జిల్లా గవర్నర్ కాసం అంజయ్య(80) ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు సోదరులు, ఒక కుమారుడు ఉన్నారు. అంజయ్య మరణ వార్తతో విశ్వ విద్యాలయాలు, కళాశాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, లయన్ ప్రముఖులు అంతిమ వీడ్కోలుకు తరలివచ్చారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కాసం అంజయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1966లో వరంగల్ సీకేఎం కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా అధ్యాపక వృత్తి ప్రారంభించి.. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1976లో లయన్స్ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థను జనగామలో స్థాపించి వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశారు. 1989లో జిల్లా గవర్నర్ పదవి చేపట్టారు. ఆయన మార్గదర్శనంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో లయన్స్ క్లబ్‌లు విస్తరించాయి. ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న 1975 సమయంలో జనగామలో ఏర్పాటు చేసిన ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండు దశాబ్దాలకు పైగా పని చేసిన ఆయన 2001లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. ఆవోపా సంస్థ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి అనతి కాలంలోనే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అంతిమ వీడ్కోలుకు ప్రముఖులు

అంజయ్య అంతిమ వీడ్కోలుకు అనేక ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి, పూర్వ ఆచార్యులు టి.సుధాకర్ రెడ్డి, రమణయ్య, శంకరయ్య, పూర్వ ఇంటర్మీడియెట్ డైరెక్టర్ రమేశ్ సునీల్ కుమార్, మల్టీఫుల్ కౌన్సిల్ మాజీ చైర్మన్లు ఎం.విద్యాసాగర్‌రెడ్డి, శీలం మోహన్‌రావు, లయన్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, బండ్ర శేఖర్ ఆర్య, ఎన్.సుధాకర్‌రెడ్డి, పి.హరికిషన్ రెడ్డి, కె.గోవిందరాజ్, వెంకటేశ్వరరావు, కె.సి.జాన్ బన్నీ, ముచ్చ రాజిరెడ్డి, టి.లక్ష్మీనరసింహారావు, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రతాప్ రెడ్డి, అల్లాడి ఈశ్వర్‌రావు, ప్రభాకర్ రావు, కుక్కెమెల్ల యాదగిరి, నాగులంచ రమేందర్, డాక్టర్ రాజమౌళి తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

పండగ వేళ విషాదం..

దైవదర్శనానికి వెళ్తూ విద్యార్థి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న టాటా ఏస్
- నల్లగట్టుగుట్ట సమీపంలో ఘటన



ఉదయ్ (ఫైల్)

హసన్‌పర్తి: పండగ వేళ విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి బైక్‌పై దైవదర్శనానికి వెళ్తుండగా టాటా ఏస్ ఢీకొనడంతో ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. బైక్ వెనుక కూర్చున్న విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారి హసన్‌పర్తి నల్లగట్టు గుట్ట సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన రామటెంకి శ్రవణ్ కుమారుడు ఉదయ్(18) ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ చదువుతున్నారు. ప్రస్తుతం అన్నాసాగరంలో అద్దెకుంటున్నాడు.

స్నేహితులతో కలిసి దైవదర్శనానికి..

శ్రీరామ నవమి పండగ సందర్భంగా ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి అదే కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న రజితతో కలిసి బైక్‌పై అన్నాసాగరం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని నల్లగట్టు గుట్ట సమీపంలో రేగొండ హనుమకొండ నుంచి ఎల్కతుర్తి వైపునకు వస్తున్న ఓ టాటా ఏస్.. ఖున్నాను అనుసరిస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఉదయ్, రజిత తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఇల్లందులో కారు ఢీకొని వృద్ధుడి..



ఎల్లయ్య మృతదేహం

వర్ధన్నపేట: కారు ఢీకొనడంతో సైకిల్‌పై వెళ్తున్న ఓ వృద్ధ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇల్లందలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన సాతుపెల్లి ఎల్లయ్య(52) పాత ఇనుప సామాను కొనుగోలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వర్ధన్నపేటలో సామానుకొనుగోలు చేసిన అనంతరం అక్కడే విక్రయించి సైకిల్‌పై తిరిగి తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లంద సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వెనుక నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న కారు అదుపు తప్పి సైకిల్‌ను ఢీకొంది. దీంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సైకిల్.. కారు ముందు భాగంలోని బంపర్‌లో ఇరుక్కుపోయింది. అయినా డ్రైవర్ అదే వేగంతో ఆపకుండా వెళ్లగా కమ్మరిగూడెం క్రాస్ వద్ద బంపర్ నుంచి సైకిల్ కిందపడింది. గ్రామస్తులు ఈ సమాచారం తమ సన్నిహితులకు అందించగా గుంటూరుపేట వాటర్ ట్యాంక్ సమీపంలో కారు ఆపగా డ్రైవర్ దిగి పరారైనట్లు స్థానికులు తెలిపారు. మృతుడి చిన్న కుమారుడు దినేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెట్టు పైనుంచి నడుస్తూ..

- పొలంలో పడి రైతు మృతి
- బర్రాం తండాలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన..



సిరి(ఫైల్)

నర్సింహులపేట: గెట్టు పైనుంచి నడిచి వెళ్తున్న క్రమంలో పొలంలో జారి పడి ఓ రైతు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగు చూసింది. మండలంలోని పడమటిగూడెం శివారు బర్రాం తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ సిరి(40) మూడు రోజుల క్రితం వివాహ వేడుకకు హాజరయ్యాడు. అనంతరం మద్యం తాగి పొలం వద్దకు వెళ్లాడు. ఇక్కడ గెట్టు ఒరం జారి పొలంలో పడి మృతి చెందాడు. ఇంతకు ముందు పలుమార్లు మద్యం తాగి 2,3 రోజుల అనంతరం ఇంటికి వచ్చేవాడు. ఇదే మాదిరి ఏదో ప్రాంతానికి వెళ్లాడని కుటుంబసభ్యులు భావించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చుట్టుపక్కల రైతులకు దుర్వాసన రావడంతో చూశారు. సిరి మృతి చెంది కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎస్సై రాజు, నర్సింహులపేట ఎస్సై వెంకన్న ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

దరఖాస్తుకు 19న చివరి తేదీ
- మే 13వ తేదీన ప్రవేశ పరీక్ష
- ఎస్సీ, ఎస్టీలకు ఫీజు రూ.250
- జనరల్ కేటగిరీలకు రూ.500
- పదో తరగతి విద్యార్థులకు సువర్ణావకాశం

దరఖాస్తు ఫీజు వివరాలు..

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశాలకుగాను ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.250 కాగా, బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులకు రూ.500 ఫీజు చెల్లించాలి. ఆలస్య రుసుము రూ.100తో ఏప్రిల్ 22వ తేదీ వరకు, రూ.300 ఫీజుతో ఏప్రిల్ 23 వరకు గడువు కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష మే 13వ తేదీన నిర్వహించనున్నారు. Sbtet.telangana.govt.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు.



మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు సాంకేతిక విద్యా కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అవకాశం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం పాలిసెట్ ఎంట్రెన్స్ ప్రవేశాలకు రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వ్యాప్తంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అందించే వ్యవసాయ డిప్లొమా కోర్సులు, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోర్సుల్లో, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అనుబంధ సంస్థల్లో అడ్మిషన్లను పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు.

పది, ఆపై తరగతుల విద్యార్థులకు అవకాశం

పదో తరగతి తర్వాత త్వరగా స్థిరపడాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులతో జీవితంలో స్థిరపడొచ్చు. ఉద్యోగం వద్దనుకుంటే బీటెక్ సెకండియర్‌లో చేరి ఉన్నత విద్యనభ్యసించవచ్చు. బంగారు భవిష్యత్ బాటలు వేసే పాలిటెక్నిక్ విద్యార్థులకు సువర్ణావకాశమని విద్యావేత్తలు చెబుతున్నారు. సప్లిమెంటరీలో, ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు. దీంతో ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంపిక మార్కులు ఇలా..

మొత్తం డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష 2:30 నిమిషాల వ్యవధి ఉంటుంది. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో పదోతరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్షను మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో గణితం–60, ఫిజిక్స్–30, బయాలజికల్–30, కెమిస్ట్రీ–30 మార్కుల చొప్పున ప్రశ్న పత్రం రూపొందిస్తారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి 1:30 గంటల వరకు ఉంటుంది. పాలిటెక్నిక్‌లో ఇంజినీరింగ్ కోర్సు చేసే విద్యార్థులు బయాలజికల్ తప్ప మిగిలిన సబ్జెక్టులు, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రవేశాల పరీక్షలు అంటెప్ట్ చేయాలి. అగ్రికల్చర్, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు పరీక్ష రాసే విద్యార్థులు బయాలజికల్ 30 మార్కుల ప్రశ్నలు రాయాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్ ప్రవేశ మార్కుల ఎస్‌బీటీఈటీ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు 120 మార్కులలో 30 శాతం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి అంటే 36 మార్కులు, వ్యవసాయ పాలిటెక్నిక్, వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు 120 మార్కులలో 30 శాతం గణితం, బయాలజికల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి అంటే రెండు మార్కుల్లో 36 మార్కులు తప్పనిసరిగా స్కోర్ చేస్తే సీటు సాధిస్తారు.

డిప్లొమాతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు



పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో సీటు సాధించాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. పది సిలబస్‌తోనే ప్రశ్నలు ఉంటాయి. కష్టపడి చదివితే సీటు వస్తుంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు త్వరగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించొచ్చు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్పించి చదివిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.

– బైరి ప్రభాకర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

ఫాతిమా హైస్కూల్‌లో స్పాట్ కేంద్రం
- 2,27,864 జవాబు పత్రాల రాక
- స్పాట్ విధులకు 957 మంది టీచర్లు
- సీనియారిటీ ప్రకారం 6 జిల్లాల వారికి విధులు
- గతేడాది రెమ్యునరేషన్ విడుదల



విద్యారణ్యపురి: పదోతరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటినుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండలోని కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడికి తీసుకొచ్చిన పదోతరగతి జవాబు పత్రాల కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం పూర్తయింది.

ఉమ్మడి జిల్లా నుంచి జవాబు పత్రాల రాక

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల టెన్త్ స్పాట్ కేంద్రాన్ని హనుమకొండలో ఏర్పాటు చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలన్నీ కలిపి 2,27,864 కేంద్రానికి తీసుకొచ్చారు. ఈ స్పాట్ కేంద్రానికి క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లా డీఈఓ డి.వాసంతి వ్యవహరిస్తున్నారు.

సీఈలు, ఏఈలు 741, స్పెషల్ అసిస్టెంట్లు 216 మంది..

పదో తరగతి మూల్యాంకనానికి ఆరు జిల్లాలోని ఆయా సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను, సీఈలుగా, ఏఈలు గాను టీచర్లను సీనియారిటీ ప్రకారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జవాబు పత్రాలు వ్యాల్యుయేషన్ చేసే టీచర్లు కనీసం మూడేళ్లు ఆయా సబ్జెక్టులో విద్యాబోధన చేసి ఉండాల్సిందే. రోజుకు టీఫ్ ఎగ్జామినర్లుగా (సీఈ)లుగా 108 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా (ఏఈ)లుగా 633 మంది మొత్తం 741 మంది టీచర్లను నియమించారు. స్పెషల్ అసిస్టెంట్లుగా సెకండరీ గ్రేడ్ టీచర్లను (ఎస్జీటీ) 216 మందిని నియమించారు. మొత్తం 957మంది టీచర్లు స్పాట్ విధులు నిర్వహించనున్నారు.

నేడు ఉదయం రిపోర్టు చేయాలి..

కాజీపేటలోని టెన్త్ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఆయా టీచర్లు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. రోజుకు ఒక్కో టీచర్ 40 జవాబు పత్రాలు వ్యాల్యుయేషన్ చేయాలి. రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విధుల్లో ఉంటారు. స్పాట్ విధుల ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధుల్లో పాల్గొనాలని, గైర్హాజర్ టీచర్లపై చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గతేడాది రెమ్యునరేషన్ విడుదల!

గతేడాది ఏప్రిల్‌లో టెన్త్ స్పాట్ వ్యాల్యుయేషన్ విధులు నిర్వర్తించిన టీచర్లకు ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్ రూ.59 లక్షలు పైగా ఐదేవలే జిల్లా విద్యాశాఖకు విడుదల అయ్యాయి. అయితే గతేడాది టెన్త్ స్పాట్ విధుల్లో పాల్గొన్న టీచర్లు, ఇతర సిబ్బంది మొత్తం 1,072 మందికి కూడా మూడ్రోజుల క్రితం వారి అకౌంట్లలోకి రెమ్యునరేషన్‌ను విడుదల చేశారని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

వల్మిడి ఆలయంలో భక్తులకు గాయాలు



గాయపడిన చిన్నారి మనుశ్రీకి చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- గాలి దుమారంతో కూలిన టెంట్లు

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఒక్కసారిగా వీచిన గాలి దుమారం రావడంతో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం వద్ద టెంట్లు కూలాయి. దీంతో భక్తులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. అక్కడే ఉన్న భక్తులపై టెంట్లకు ఉన్న దుద్దులు వాసారి మారయ్య, చెన్నూరుకు చెందిన బాలిక మారేపల్లి మనుశ్రీ, గంట్లకుంటకు చెందిన సంధ్యారాణి గాయపడ్డారు. వారికి ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రథమ చికిత్స చేశారు.

మానుకోటలో సూర్యాపేట పోలీసుల విచారణ

మహబూబాబాద్ రూరల్: సూర్యాపేట జిల్లాలో జరిగిన ఓ హత్య కేసు విషయంలో అక్కడి పోలీసులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి విచారణ చేపట్టారు. నిందితులు సూర్యాపేటలో హత్య చేసి, వారు వాడిన ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లను మహబూబాబాద్‌లో ఉంచి వెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లను కొత్త కూరగాయల మార్కెట్ ఆవరణలో ఉంచి వెళ్లగా సూర్యాపేట పోలీసులు స్వాధీనం చేసుకుని తమ వెంట తీసుకెళ్లారు. హత్య కేసులో మహబూబాబాద్‌లోని ఓ మెడికల్ షాపు నిర్వాహకుడి బంధువు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

రాములోరి కల్యాణంలో ఫ్లెక్సీల రగడ



కాశిబుగ్గ ఆలయం వద్ద మంత్రి ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వరంగల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తులకు ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. కాశిబుగ్గలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కల్యాణోత్సవానికి రూ.8.90 లక్షల నిధులను ప్రభుత్వం నుంచి మంత్రి కొండా సురేఖ మంజూరు చేయించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మంత్రి సురేఖ, స్థానిక కార్పొరేటర్ ఫొటోలు అధికార పార్టీకి చెందిన నాయకుల ఫొటోలు పెట్టకపోవడం సరికాదని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు. ఆలయంలో జరిగే కార్యక్రమాల్లో సైతం నాయకుల వర్గపోరు బయటపడింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ దాతల డబ్బులతోనే కల్యాణ ఏర్పాట్లు చేశారని తెలుస్తోంది.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బుకీ అరెస్ట్

వరంగల్ క్రైం: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బుకీని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పీఎస్ పరిధిలో ఐపీఎల్ పట్టుకున్న క్రికెట్ బెట్టింగ్ ఏజంట్లు హైదరాబాద్‌కు చెందిన చింతపండు కృష్ణ, మెడిశెట్టి నరేశ్‌తో పాటు అగాన్నట్లు పులి ఓంకార్, పల్లపు సుకేశ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1.58 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. వారు క్రికెట్ బుకీ వివరాలు తెలపడంతో కరీనగర్‌కు చెందిన గడ్డం వీరమణి కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేసి నిందితుడి నుంచి రూ. 1.50 లక్షల నగదు, 2 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. హనుమకొండకు చెందిన మరో ఇద్దరు కిటరి రంజిత్, హైదరాబాద్‌కు చెందిన బుకీ యోగేశ్ గుప్తా పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.